ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
మంగళవారం 3 జూన్ 2025

'అత్యాచారం' కేసులో

ఆరు నెలల్లోనే తీర్పు

- దోషికి 30 ఏళ్లు తగ్గకుండా యావజ్జీవ కారాగార శిక్ష
- రూ.90వేల జరిమానా

చెన్నై, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అన్నా యూనివర్శిటీలో విద్యార్థినిపై జరిగిన అత్యాచార కేసులో ఆరు నెలలకే తీర్పు వెలువడింది. ముగ్గురు మహిళా ఐపీఎస్ అధికారుల నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం అందించిన సాక్ష్యాధారాలతో సంతృప్తి చెందిన చెన్నై మహిళా కోర్టు సోమవారం సంచలన తీర్పు వెల్లడించింది. ముద్దాయికి 30 ఏళ్లపాటు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.90 వేల జరిమానా విధించింది. ఈ తీర్పుపై రాజకీయ నేతలు, వివిధ వర్గాలు వారు హర్షం వ్యక్తం చేశారు. గత యేడాది డిసెంబర్ 23 రాత్రి అన్నా విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థినిపై అదే ప్రాంతానికి చెందిన వ్యక్తి అత్యాచారానికి పాల్పడి, ఆ దృశ్యాలను మొబైల్‌లో వీడియోలో చిత్రీకరించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బాధితురాలు కోట్టూరుపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు దర్యాప్తు జరిపి అదేప్రాంతంలో బిర్యానీ షాపు నడుపుతున్న జ్ఞానశేఖరన్ (37)ను డిసెంబర్ 24న అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఎఫ్ఐఆర్ వివరాలు ప్రసార మాధ్యమాల్లో వెలువడి రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ప్రకంపనలు రేగాయి. బాధితురాలి పేరు, వివరాలు వెల్లడి కావటం పట్ల అన్ని పార్టీల రాజకీయ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అదే సమయంలో జ్ఞానశేఖరన్ అరెస్టయిన సమయంలో ఎవరితోనో సెల్‌ఫోన్‌లో 'సార్.. సార్..' అంటూ మాట్లాడినట్లు పుకార్లు వ్యాపించడంతో 'ఆ సార్ ఎవరు?' అంటూ ప్రధాన ప్రతిపక్షనేత ఎడప్పాడి విమర్శలు చేశారు. అనంతరం జ్ఞానశేఖరన్‌పై గూండాచట్టం ప్రయోగిస్తూ నగర పోలీసు కమిషనర్ అరుణ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అత్యాచారం కేసులో అరెస్టయిన జ్ఞానశేఖరన్‌కు డీఎంకే నేతలతో సంబంధాలున్నాయని, కేసును సీబీఐకి అప్పగించాలని అన్నాడీఎంకేకు చెందిన న్యాయవాది వరలక్ష్మి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. ఈ కేసుపై విచారణ జరిపేందుకు మహిళా ఐపీఎస్ అధికారులు స్నేహప్రియ, బృందా, ఐమాన్ జమాల్‌తో సిట్ ఏర్పాటు చేసింది. ఆ దర్యాప్తు బృందం విచారణ జరిపి ఫిబ్రవరి 24న సైదాపేట 9వ క్రైం కోర్టులో ఛార్జిషీటును సమర్పించింది విద్యార్థినిపై జరిగిన అత్యాచారం కేసులో జ్ఞానశేఖరన్ తప్ప ఇతరులెవరికీ సంబంధం లేదని నివేదించింది. మార్చి 7న ఈ కేసు విచారణ నగరంలోని మహిళా కోర్టుకు బదిలీ చేశారు. ఏప్రిల్ 23 నుండి 25 మంది సాక్షుల విచారణ జరిగింది.. పోలీసులు ఈ నేరానికి సంబంధించి 75 సాక్ష్యాధారాలను సమర్పించారు. వాదోపవాదనలు మే 20న ముగిశాయి. దీంతో సోమవారం ఉదయం మేజిస్ట్రేట్ ఎం.రాజలక్ష్మి ముద్దాయి జ్ఞానశేఖరన్‌కు 30 యేళ్లపాటు జైలులోనే గడిపేలా యావజ్జీవ కారాగార శిక్ష, రూ.90వేల జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. జరిమానా మొత్తాన్ని బాధితురాలికి అందించాలని ఆదేశించారు.



జ్ఞానశేఖరన్‌ను కోర్టులో హాజరు పరిచేందుకు తీసుకెళ్తున్న పోలీసులు

- జ్ఞానశేఖరన్‌కు విధించిన శిక్ష వివరాలు -



జ్ఞానశేఖరన్ (ఫైల్‌ఫొటో)

- ఐపీఎస్‌సీ 329 సెక్షన్ ప్రకారం విద్యార్థిని పట్ల దురుసుగా ప్రవర్తించడం - 3 యేళ్ల జైలు శిక్ష
- సెక్షన్ 126 (2) ప్రకారం యువతిని వెళ్ళనీయకుండా అడ్డుకోవటం - నెల జైలు శిక్ష
- సెక్షన్ 87 ప్రకారం బలవంతంగా కిడ్నాప్ చేసి తన వాంఛ తీర్చుకోవడానికి వత్తిడి చేయడం - పదేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా
- సెక్షన్ 127 (2) గాయపరచడం - యేడాది జైలు శిక్ష
- సెక్షన్ 75(2) ప్రకారం బాధితురాలిపై లైంగిక వేధింపులకు పాల్పడటం - మూడేళ్ల జైలు శిక్ష
- సెక్షన్ 76 ప్రకారం తీవ్రంగా దాడి చేయడం - ఏడేళ్ల జైలు శిక్ష రూ.10వేల జరిమానా
- సెక్షన్ 64(1) ప్రకారం లైంగిక అత్యాచారం - 30 యేళ్లకు తగ్గకుండా యావజ్జీవ కారాగార శిక్ష, రూ.25వేల జరిమానా
- సెక్షన్ 351 (3) హత్యాబెదరింపు - ఏడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా
- సెక్షన్ 238 (బి) లైంగిక వేధింపులకు సంబంధించి ఆధారాలను నాశనం చేయడం - మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా
- సెక్షన్ 66 (ఇ) ప్రకారం వ్యక్తిగత అంతరంగిక హక్కులను అతిక్రమించడం - 3 యేళ్ల జైలు శిక్ష, రూ.25 వేల జరిమానా

నేతల హర్షం...

విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడి కేసులో చక్కటి తీర్పు వెలువడిందని, ఈ కేసు ద్వారా తప్పుడు ఆరోపణలు చేస్తూ రాజకీయ పబ్బం గడపాలనుకున్న ప్రత్యర్థులకు తీవ్ర నిరాశే మిగిలిందని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. ఈ కేసును ఉదహరిస్తూ రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందంటూ గగ్గోలు పెట్టినవారికి ఈ తీర్పు చక్కటి సమాధానమిచ్చిందని స్టాలిన్ తన ఎక్స్‌పేజీలో పేర్కొన్నారు. ఈ కేసు విచారణ సమయంలో హైకోర్టు పోలీసు శాఖను మెచ్చుకుందని, ఐదునెలల వ్యవధిలో ముద్దాయి శిక్షపడేలా చేశామని ఆయన తెలిపారు.

అప్పీలు కెళ్ళినా శిక్ష తగ్గకూడదు..

కేసులో ముద్దాయి అప్పీలుకు వెళ్ళినా మహిళా కోర్టు విధించిన శిక్ష తగ్గించకుండా అనుభవజ్ఞులైన న్యాయవాదులతో వాదనలను న్యాయస్థానం ముందుంచాలని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి సూచించారు. అత్యాచారం కేసుల్లో విధించే శిక్షలు అలాంటి నేరానికి ఎవరూ పాల్పడని రీతిలో ఉండాలని పీఎంకే ఆశిస్తోందన్నారు. ఈ కేసులో అనుమానాలకు తావులేకుండా సాక్ష్యాధారాలను సమర్పించి పోలీసు శాఖ పనితీరు ప్రశంసనీయమన్నారు.

మహిళా ఐపీఎస్‌ల దర్యాప్తు ప్రశంసనీయం

అత్యాచారం కేసు విచారణలో ముగ్గురు మహిళా ఐపీఎస్‌లతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తు సమంజసంగా సమర్థనీయంగా ఉందని సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ముత్తరసన్ పేర్కొన్నారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు నమ్మకం కలిగిలా మహిళా కోర్టు తీర్పునిచ్చిందన్నారు. ఇదే విధంగా బీజేపీ మహిళా నేత తమిళిసై సౌందరరాజన్, అమ్మామక్కల్ మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్, తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) నేత జీకే వాసన్ ఈ తీర్పును స్వాగతిస్తూ ప్రకటనలు జారీ చేశారు.

'ఎవరా సార్?' అంటే కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘనే...



కోర్టు వెలుపల మీడియాతో మాట్లాడుతున్న ప్రభుత్వ న్యాయవాది మేరీ జయంతి

అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై జరిగిన లైంగిక వేధింపుల కేసులో ముద్దాయి జ్ఞానశేఖరన్‌కు మాత్రమే సంబంధం ఉందని, ఇతరులెవరికీ ఈ కేసుతో సంబంధం లేదని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కోర్టులో సమర్పించింది. ఆ ఛార్జిషీటు ప్రకారమే మహిళా కోర్టు తీర్పు వెలువరించడంతో ఇకపై ఎవరైనా 'ఎవరా సార్?' అంటూ విమర్శిస్తే వారిపై కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కేసు నమోదవుతుందని ఈ కేసులో ప్రభుత్వం తరఫున వాదించిన న్యాయవాది మేరీ జయంతి మీడియా ముందు హెచ్చరించారు. మహిళా కోర్టు తీర్పు అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ జ్ఞానశేఖరన్‌కు విధించిన శిక్షలో ఏమాత్రం రాయితీలుండవని, కఠిన కారాగారా శిక్ష అనుభవించాల్సిందేనన్నారు. జ్ఞానశేఖరన్ అరెస్టయినప్పుడు అతడి ఫోన్ ఏరోప్లేన్ మోడ్‌లో ఉన్నట్లు సెల్ కంపెనీ కోర్టుకు తెలిపిందని ఆమె వివరించారు.

'ఆ సార్' ఎవరో తెలుసుకుంటాం: ఈపీఎస్

ఈ తీర్పుపై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) వ్యాఖ్యానిస్తూ ముద్దాయితోపాటు మరికొందరికి కూడా ఈ కేసుతో సంబంధాలున్నాయని తమ పార్టీ మొదటి నుండి ఆరోపణలు చేస్తున్నా పట్టించుకోలేదన్నారు. ముద్దాయి జ్ఞానశేఖరన్ ఫోన్‌లో ఏ 'సార్'తో మాట్లాడారో తమ పార్టీ అధికారంలోకి వచ్చాక తెలుసుకుని 'ఆ సార్'కు కఠిన శిక్షపడేలా చేస్తుందన్నారు.

బీజేపీ చొరవ వల్లే...

అన్నా విశ్వవిద్యాలయం అత్యాచార సంఘటనపై బీజేపీ ధర్నాలు, రాస్తారోకో తదితర ఆందోళనలు చేయటం వల్లే ముద్దాయికి త్వరితగతిన శిక్ష పడిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ అన్నారు. బీజేపీ తీసుకున్న చొరవవల్లే పోలీసులు త్వరగా నిందితుడిని అరెస్టు చేశారని తెలిపారు. మహిళా కోర్టు చారిత్రక తీర్పు వెలువరించిందన్నారు.

సీఎం స్టాలిన్‌తో జస్టిస్ కురియన్ జోసెఫ్ కమిటీ భేటీ



సచివాలయంలో సీఎంతో భేటీ అయిన జస్టిస్ కురియన్ జోసెఫ్ బృందం

చెన్నై, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నడుమ సంబంధాలను మెరుగుపరిచేందుకు, కోల్పోయిన రాష్ట్ర హక్కులను తిరిగి పొందటానికి ఏర్పాటు చేసిన జస్టిస్ కురియన్ జోసెఫ్ ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకున్నారు. ఈ కమిటీకి నాయకత్వం వహిస్తున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్, సభ్యులుగా ఉన్న ఇండియన్ మారిటైమ్ యూనివర్శిటీ మాజీ వైస్‌ఛాన్సలర్ అశోక్‌వర్ధన్ శెట్టి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు ఎం.నాగనాథన్ సోమవారం ఉదయం ముఖ్యమంత్రి స్టాలిన్‌తో భేటీ అయ్యారు. ఈ ముగ్గురితోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, పబ్లిక్ సెక్టార్ కార్యదర్శి రీటా హరీష్ టక్కర్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు.

చేపాక్‌లో కార్యాలయం

ఈ కమిటీ కార్యాలయం కోసం చేపాక్‌లో పాత ప్రభుత్వ అతిథి గృహాన్ని అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఆ భవనంలో కమిటీ సభ్యులకు ప్రత్యేక క్యాబిన్‌లు కూడా నిర్మిస్తున్నారు. ఈ కమిటీ త్వరలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నడుమ సంబంధాలపై అధ్యయనాన్ని ప్రారంభిస్తుందని అధికారులు చెబుతున్నారు.

ఉదయనిధికి అస్వస్థత

- ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలు రద్దు

పెరంబూర్, జూన్ 2: ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి అస్వస్థతకు గురికావడంతో, ఆయన పాల్గొనే ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలు రద్దు చేశారు.. ఈ మేరకు సచివాలయం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... డీఎంకే యువజన విభాగం కార్యదర్శి ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తీవ్ర జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతున్నారని, కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారని, అందువల్ల ఉప ముఖ్యమంత్రి పాల్గొనే ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలు రద్దు చేస్తున్నట్లు సచివాలయం తెలిపింది.

విమాన చార్జీలకు రెక్కలు



అడయార్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. దీంతో సొంతూర్ల నుంచి నగరానికి వచ్చేవారి సంఖ్య ఒక్కసారిగా పెరిగిపోయింది. ప్రభుత్వ రవాణా సంస్థకు చెందిన బస్సులతో పాటు రైళ్ళలో విపరీతమైన రద్దీ నెలకొంది. ముందస్తు రిజర్వేషన్ లేకపోవడంతో అనేకమంది విమాన ప్రయాణంపై ఆసక్తి చూపించారు. ఈ కారణంగా విమాన చార్జీలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ముఖ్యంగా మదురై నుంచి చెన్నై వచ్చేందుకు సాధారణ రోజుల్లో రూ.4,542 చార్జీ కాగా, సోమవారం టిక్కెట్ ధర రూ.17,401కు చేరుకుంది. అలాగే, తిరుచ్చి చెన్నై ప్రాంతాల మధ్య రూ.9,164 (సాధారణ రోజుల్లో రూ.2,334), కోవై - చెన్నై మధ్య రూ.6,475 (సాధారణ రోజుల్లో రూ.3,550) వసూలు చేశారు. అలాగే చెన్నై నుంచి సేలం, తూత్తుకుడి, కన్నియాకుమారి, తిరునెల్వేలి ప్రాంతాల మధ్య కూడా విమాన టిక్కెట్ ధరలు రెండు రెట్లు పెరిగాయి. అయినప్పటికీ చెన్నై వచ్చేందుకు నగర వాసులు పోటీపడ్డారు. ఈ కారణంగా విమాన చార్జీల ధరలు పెరగడంతో పాటు ఎయిర్‌పోర్టుల్లో తీవ్రమైన రద్దీ నెలకొంది.

పరనూరు - ఆత్తూరు టోల్‌ప్లాజాల్లో వాహనాల రద్దీ

వేసవి సెలవుల తర్వాత దూర ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే ప్రయాణికుల సంఖ్య ఒక్కసారిగా పెరిగిపోయింది. దీంతో పరనూరు, ఆత్తూరు టోల్‌ప్లాజాల వద్ద ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. వాహనాలు కిలోమీటర్ల కొద్ది బారులుదీరడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. రాష్ట్రంలో సోమవారం నుంచి పాఠశాలలు ప్రారంభమైన విషయం తెల్సిందే. ప్రైవేటు పాఠశాలలు మాత్రం ఈ నెల 5వ తేదీ నుంచి పునఃప్రారంభంకానున్నాయి. దీంతో వేసవి సెలవుల కోసం సొంతూర్లకు వెళ్ళిన వారంతా తమ పిల్లలతో నగరానికి తిరిగి వస్తుండడంతో దీంతో ట్రాఫిక్ ఒక్కసారిగా పెరిగిపోయింది. ఈ కారణంగా టోల్‌ప్లాజాల వద్ద వాహనాలు బారులు తీరాయి. ఫాస్టాగ్ పేమెంట్ అమలు చేస్తున్నప్పటికీ స్కాన్ చేయడంలో జాప్యం కారణంగా టోల్‌ప్లాజా దాటేందుకు కొంత సమయం పడుతోంది. దీంతో వాహనాలు కిలోమీటర్ల కొద్దీ బారులుదీరి, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తిరుచ్చి, మదురై, తిరునెల్వేలి, నాగర్‌కోయిల్, తూత్తుక్కుడి, తంజావూరు, కన్నియాకుమారి, సేలం, ఈరోడ్, తిరుపూర్, కోయంబత్తూరు, నామక్కల్, రామనాథపురం, కడలూరు, వేలూరు తదితర జిల్లాల నుంచి నగరానికి వచ్చే వారి సంఖ్య అధికంగా ఉంది. దీంతో నగర శివారు ప్రాంతాలైన కిలాంబాక్కం, వండలూరు, పెరుంగళత్తూరు, తాంబరం, పల్లావరం, క్రోంపేట, గిండి తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య అధికంగా కనిపించింది.

మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా

హేమంత్ చందన్ గౌడ



జస్టిస్ హేమంత్ చందన్ గౌడ

ప్యారీస్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హైకోర్టు కొత్త న్యాయమూర్తిగా హేమంత్ చందన్ గౌడ బాధ్యతలను స్వీకరించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కేఆర్ శ్రీరామ్ సోమవారం జస్టిస్ హేమంత్ చందన్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తిగా వ్యవహరించిన హేమంత్ చందన్ గౌడ మద్రాస్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. కొత్త న్యాయమూర్తి పదవీ బాధ్యతలు చేపట్టడంతో హైకోర్టులోని న్యాయమూర్తుల సంఖ్య 63కు పెరిగింది.

ఈ నేపథ్యంలో, పదవీబాధ్యలు స్వీకరించిన జస్టిస్ హేమంత్ చందన్ గౌడను పలువురు న్యాయమూర్తులు, హైకోర్టు న్యాయమూర్తుల సంఘాల ప్రతినిధులు, సీనియర్ న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

మోగిన బడిగంటలు



- తొలి రోజే 35 లక్షల యూనిఫాం, 2.17 కోట్ల పుస్తకాల పంపిణీ
- స్వయంగా పుస్తకాలు అందించి, పాఠాలు విన్న సీఎం

చెన్నై, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వేసవి సెలవుల అనంతరం సోమవారం ఉదయం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. పాఠశాలలు ప్రారంభానికి వారం రోజులకు ముందునుంచి పాఠశాలలో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరిగాయి. పాఠశాలలకు కొత్తగా పెయింటింగ్ చేసి అందంగా తీర్చిదిద్దారు. ఒకటి నుండి ఐదో తరగతి వరకు చదువుతున్న బాలబాలికలు కొత్త యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, కొత్త బ్యాగులు పట్టుకుని ఉత్సాహంగా పాఠశాలలకు వచ్చారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గులాబీలు, మిఠాయిలు పంచిపెట్టి వీరికి స్వాగతం పలికారు

రాజధాని నగరంలో...

రాజధాని నగరం చెన్నైలోని కార్పొరేషన్, ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు వేసవి సెలవుల అనంతరం వచ్చిన విద్యార్థులతో సందడిగా మారాయి. కార్పొరేషన్ పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలకు మేయర్ ఆర్.ప్రియా, సీఎండీఏ ఇన్‌ఛార్జి మంత్రి పీకే శేఖర్‌బాబు, కార్పొరేషన్ కమిషనర్ కుమారగురుబరన్ పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం పంపిణీ చేశారు.

లేడీ విలింగ్టన్ స్కూలులో సీఎం...

నగరంలోని ట్రిప్లికేన్ లేడీ విలింగ్టన్ ప్రభుత్వ ఆదర్శ బాలికల పాఠశాలలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బాలబాలికలకు మిఠాయిలు పంచిపెట్టారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఉచిత యూనిఫాం, బ్యాగ్‌లు అందజేశారు. ఆ తర్వాత ఓ తరగతిగదిలో కూర్చుని డిజిటల్ బోర్డు ద్వారా ఉపాధ్యాయురాలు చెబుతున్న పాఠాన్ని విన్నారు. స్టాలిన్‌తో పాటు మంత్రులు పీకే శేఖర్‌బాబు, అన్బిల్ మహేష్ , గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, ఎంపీ దయానిధి మారన్, ఎమ్మెల్యేలు డి.వేలు, ఇ.పరంథామన్, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, రాష్ట్ర పాఠ్యపుస్తకాల సంస్థ అధ్యక్షుడు దిండుగల్ ఐ.లియోనీ, చెన్నై జిల్లా కలెక్టర్ రష్మీ సిద్ధార్థ్ తదితరులు పాల్గొన్నారు.



ట్రిప్లికేన్ లేడీ విలింగ్టన్ స్కూలులో ఓ విద్యార్థినికి పాఠ్యపుస్తకాలు, బ్యాగ్ అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

బ్యాండ్ వాయిద్యంతో స్వాగతం

వేలూరు కొన్‌వట్టమ్ ప్రాంతంలో ఉన్న కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలకు వేసవి సెలవుల తర్వాత విచ్చేసిన విద్యార్థులకు పాఠశాల నిర్వాహకులు బ్యాండ్ వాయిద్యంతో ఘనస్వాగతం పలికారు. ఒకటో తరగతిలో చేరనున్న 38 మంది విద్యార్థులను పూల కిరీటాలతో అలంకరించి, బెలూన్లు అందజేసి బ్యాండ్ వాయిద్యాలతో స్వాగతం పలికారు.



వేలూరు కొన్‌వట్టమ్ పాఠశాలలో బాలబాలికలకు బ్యాండ్ మేళంతో స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



డిజిటల్ క్లాస్‌రూమ్‌లో బాలికలతోపాటు కూర్చుని పాఠాలు వింటున్న స్టాలిన్, మంత్రి అన్బిల్ మహేష్, ఎంపీ దయానిధి మారన్ తదితరులు

సమాచార దర్శిని

ఫిషరీస్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మత్స్య సంబంధిత కోర్సుల్లో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తమిళనాడు జె.జయలలిత మత్స్య విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఫెలిక్స్ తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... వర్సిటీ పరిధిలో 10 అనుబంధ కళాశాలలు, ఒక ప్రైవేటు కళాశాల ఉన్నాయని, ఈ కళాశాలల్లో ఐదు మత్స్య సంబంధిత నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు, మూడు ప్రొఫెషనల్ డిగ్రీ కోర్సులు అందిస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం అనుబంధ కళాశాలల్లో 398 సీట్లు, ప్రైవేటు కళాశాలలో 55 సీట్లు భర్తీ చేయనున్నారు. ప్రత్యేక కేటగిరీలకు 26 సీట్లు, దివ్యాంగులకు 5 శాతం సీట్లు కేటాయించారు. విద్యార్థులు www.admission.tnjfu.ac.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు 04365-211090 అనే నెంబరు సంప్రదించవచ్చని వైస్ ఛాన్సలర్ తెలిపారు.

'బెస్ట్ సోషల్ వర్కర్' పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2024 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సాంఘిక సంక్షేమం, మహిళా హక్కుల శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ సామాజిక కార్యకర్త, ఉత్తమ సంస్థకు నగదు, ప్రశంసాపత్రం అందజేసింది. 2025 సంవత్సరం పురస్కారానికి ఆసక్తి కలిగిన వ్యక్తులు, సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐదేళ్లుగా సమాజసేవలో భాగస్వామ్యులై ఉండాలి. భాష, జాతి, సంస్కృతి, కళలు, సైన్స్ తదితర రంగాల్లో పనిచేసిన సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను https://awards.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 12వ తేదిలోపు పంపించాలి. అలాగే, చెన్నై జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పనిచేస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈ నెల 20వ తేదిలోగా స్వయంగా సమర్పించవచ్చని జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

తాత్కాలిక ఉపాధ్యాయుల నియామకానికి అనుమతి

పెరంబూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో తాత్కాలిక ఉపాధ్యాయుల నియామకానికి పాఠశాల విద్యాశాఖ అనుమతించింది. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 37,554 పాఠశాలలుండగా, 52 లక్షల మందికి పైగా విద్యార్థులున్నారు. అలాగే, విద్యా బోధనకు 2.2 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పదవీవిరమణ కారణంగా సుమారు 13 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులకు తాత్కాలిక ఉపాధ్యాయులను నియమించేందుకు పాఠశాల విద్యాశాఖ అనుమతించింది. ఇప్పటికే తాత్కాలిక ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారిని కొనసాగించేందుకు, అధిక సెలవులు పెడుతున్న తాత్కాలిక ఉపాధ్యాయుల స్థానంలో కొత్త వారిని నియమించాలని పాఠశాల విద్యాశాఖ సూచించింది.

విద్యార్థులు తక్కువగా చేరే కోర్సుల మూసివేత

పెరంబూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తక్కువగా చేరే కోర్సులు మూసివేసి, అధిక డిమాండ్ ఉన్న కోర్సులు ప్రారంభించాలని విశ్వవిద్యాలయాలకు ఉన్నత విద్యాశాఖ ఆదేశించింది. ఈ మేరకు విశ్వవిద్యాలయాలకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సమయమూర్తి పంపిన ఉత్తర్వుల్లో... మార్చి 15వ తేది ఉన్నత విద్యాశాఖ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించామన్నారు. ఆ ప్రకారం, కొన్ని విశ్వవిద్యాలయాల్లో 'నాన్ ముదల్వన్' పథకంలో, ఉద్యోగాలు పొందే విద్యార్థుల సంఖ్య పెంచేలా 'ఇంటర్న్‌షిప్' అవకాశాలు పెంచాలని నిర్ణయించామన్నారు. అలాగే, అతి తక్కువ విద్యార్థులు చేరుతున్న విభాగాలు, కోర్సులు మూసివేసి, అధిక డిమాండ్ ఉన్న కోర్సులు పెంచేలా వర్సిటీలు చర్యలు చేపట్టాలని ఉన్నత విద్యాశాఖ తెలియజేసింది.

15 ఆలయాల జీర్ణోద్ధరణ పనులకు రూ.35.87 కోట్లు

పెరంబూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వెయ్యేళ్ల ప్రాచీనమైన 15 ఆలయాలకు తుదివిడతగా రూ.35.87 కోట్లతో జీర్ణోద్ధరణ పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. రాష్ట్రంలో వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ప్రాచీన ఆలయాల జీర్ణోద్ధరణ పనులకు రూ.100 కోట్లు కేటాయించనున్నట్లు శాసనసభలో 2024-25 ఏడాది బడ్జెట్‌లో ప్రకటించారు. ఆ ప్రకటన మేరకు మార్చి 17వ తేది విడుదలైన జీవోలో, 41 ఆలయాలకు తొలివిడతగా రూ.62.06 కోట్లతో జీర్ణోద్ధరణ పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ఈ నేపథ్యంలో, హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ సిఫారసుల మేరకు వెయ్యేళ్ల చరిత్ర కలిగిన 15 ఆలయాల జీర్ణోద్ధరణ పనులకు రూ.35.87 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని అధికారులు తెలిపారు.

అరుంబాక్కం శ్మశానవాటిక మూసివేత

పెరంబూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్ మండలం 103వ వార్డు పరిధిలోని అరుంబాక్కం విద్యుత్ దహన వాటిక మరమ్మతుల కారణంగా మంగళవారం నుంచి ఈ నెల 12వ తేది వరకు మూసివేయనున్నారు. ఆ సమయంలో ప్రజలు విల్లివాక్కం, వేలంగాడు శ్మశానవాటికలు వినియోగించుకోవాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

ఎస్‌కేడీటీ పాఠశాలలో

ఏసీ తరగతి గది ప్రారంభం



చిన్నారులతో పాఠశాల నిర్వాహకులు, టీచర్లు

ప్యారీస్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక విల్లివాక్కంలోని కనక దుర్గా తెలుగు పాఠశాలల ట్రస్ట్ (ఎస్‌కేడీటీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏసీ తరగతి గదిని ఆ పాఠశాల చైర్మెన్, ఏఐటీఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ సీఎంకే రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లకు శ్రీకారం చుట్టి, కొత్తగా పాఠశాలలో చేరిన చిన్నారులకు పూలదండలు వేసి, టీచర్లతో కలిసి ఆహ్వానం పలికారు. ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రేణుక నేతృత్వంలో 1 నుండి 5వ తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదికి ఏసీ సదుపాయం కల్పించిన 'నమో గాడ్' ట్రస్టీ డాక్టర్ ఎస్.నాగభూషణం, డాక్టర్ సీఎంకే రెడ్డిలను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎస్‌కేడీటీ మహోన్నత పాఠశాలలో 6 నుండి ప్లస్‌టూ వరకు చదువుకుంటున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నిఘంటువు, యూనిఫాం ఉచితంగా అందజేశారు. సీఎంకే రెడ్డి మాట్లాడుతూ, తెలుగు కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉద్యోగావకాశాలు రావేమోనన్న ఆందోళనతో తెలుగు మీడియంలో చేర్పించేందుకు ముందుకు రావడం లేదన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే తెలుగు మీడియం తరగతులు మూతబడే అవకాశం ఉంటుందని, తల్లిదండ్రులు తమ పిల్లలకు తమిళంతో పాటు తెలుగు తదితర ఇతర భాషల్లో కూడా చదువుకునేలా ప్రోత్సహించాలని ఆయన సూచించారు.

మద్యం మత్తులో స్విమ్మింగ్‌పూల్‌లో పడి వ్యక్తి మృతి

పెరంబూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) స్థానిక పెరియమేడులో మద్యం మత్తులో స్విమ్మింగ్‌పూల్‌లో పడి వ్యక్తి మృతిచెందాడు. కొసపేట ప్రాంతానికి చెందిన శ్రీనివాసన్ ఘటన జరిగిన రోజున స్నేహితులతో కలసి మద్యం సేవించి పెరియమేడు కార్పొరేషన్ పార్క్‌లోని స్విమ్మింగ్ పూల్ వద్దకు వచ్చాడు. గట్టు మీద కూర్చొని స్నానం చేస్తున్న శ్రీనివాసన్ హఠాత్తుగా స్విమ్మింగ్ పూల్‌లో పడి నీటమునిగాడు. స్నేహితులు అతడిని స్విమ్మింగ్ పూల్ నుంచి వెలికితీసి 108 అంబులెన్స్‌లో రాజీవ్ గాంధీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మార్గమధ్యంలోనే మృతిచెందినట్లు తెలిపారు. పెరియమేడు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పొగాకు ఉత్పత్తుల విక్రయం

● 18.409 దుకాణాలకు సీలు

పెరంబూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పొగాకు ఉత్పత్తులు విక్రయించిన 18,409 దుకాణాలకు సీలు వేసినట్లు రాష్ట్ర పోలీసు శాఖ తెలిపింది. ఈ మేరకు పోలీసు శాఖ విడుదల చేసిన ప్రకటనలో... గుట్కా, పాన్ మసాలా తదితర పొగాకు ఉత్పత్తుల తయారీ, నిల్వ చేయడం, విక్రయాలపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. అలాగే, సిగిరెట్, ఇతర ఉత్పత్తులు మైనర్లు, విద్యా సంస్థల సమీపంలో విక్రయాలకు నిషేధం విధించారు. ఈ నిషేధం అమలయ్యేలా, పోలీసు, ఆహార భద్రత, నగరాభివృద్ధి శాఖలు సంయుక్తంగా 2023 నుంచి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాయి. ఈ బృందాలు ఇప్పటివరకు 5.28 లక్షల దుకాణాలు తనిఖీ చేసి 1.78 లక్షల కిలోల నిషేధిత పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నాయి. అలాగే, నిషేధిత ఉత్పత్తులు విక్రయించిన దుకాణాలకు ఆహార భద్రత శాఖ రూ.39.14 కోట్ల జరిమానా, 18,409 దుకాణాలకు సీలు వేయగా, పోలీసు శాఖ 43,167 కేసులు నమోదుచేసి రూ.4.11 లక్షల జరిమానా వసూలుచేసినట్లు పోలీసు శాఖ తెలిపింది.

మాదకద్రవ్యాల విక్రయం

● ముగ్గురి అరెస్ట్

ప్యారీస్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానం నందంబాక్కంలో మాదకద్రవ్యాన్ని విక్రయించిన ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారినుండి 11 గ్రాముల మెతబెటామిన్, మూడు ఐఫోన్లు, కారు, ఎలక్ట్రానికల్ తూకాన్ని స్వాధీనం చేసుకున్నారు. సెయింట్ థామస్ మౌంట్ ఎక్సైజ్ సిబ్బంది హెచ్చరిక మేరకు ఆదివారం నందంబాక్కం ప్రాంతంలో నిఘా వేసిన పోలీసులు అక్కడున్న ఓ వంతెన సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారు పొంతనలేకుండా సమాధానం చెప్పడంతో వారి సంచులను తనిఖీ చేసి, అందులో మెతబెటామిన్ గుర్తించారు. అనంతరం మెపుకుంద్రంకు చెందిన ప్రశాంత్ (24), సంజయ్ (20), సాలిగ్రామానికి చెందిన యోగేష్ (20)లను అరెస్టు చేసి సోమవారం ఉదయం కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్ట్

ప్యారీస్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్ ప్రాంతంలో చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన ఒడిశా యువకుడిని పోక్సో చట్టం కింద పోలీసులు అరెస్టు చేశారు. 2018వ సంవత్సరం ట్రిప్లికేన్ ప్రాంతంలో జరిగిన భవన నిర్మాణం పనుల్లో ఒడిశా రాష్ట్రానికి చెందిన 10కి పైగా కుటుంబాలు పాల్గొన్నాయి. ఈ పనుల్లో పాల్గొన్న 19ఏళ్ళ యువకుడు ఎనిమిదేళ్ళ చిన్నారిపై అత్యాచారానికి పాల్పడినట్లు బాలిక తల్లిదండ్రులు ట్రిప్లికేన్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిని 2021 ఆగస్టు 17వ తేదీన పోక్సో చట్టం కింద పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మద్రాస్ హైకోర్టు ప్రాంగణంలోవున్న పోక్సో కేసులపై విచారణ జరుపుతున్న కోర్టు మంజూరు చేసిన బెయిల్‌పై విడుదలైన ఆ యువకుడికి ప్రస్తుతం 26 ఏళ్ళు నిండాయి. న్యాయస్థానం ఇచ్చిన అరెస్టు వారెంటుతో సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు ట్రిప్లికేన్ పోలీసులు తెలిపారు.

కళాశాల విద్యార్థిని దారుణహత్య

పెరంబూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు ఇంట్లో చొరబడి కళాశాల విద్యార్థినిని దారుణంగా హతమార్చిన ఘటన కోయంబత్తూర్ జిల్లాలో సోమవారం చోటుచేసుకుంది. పొల్లాచ్చి సమీపం వరుగపాళయం ప్రాంతానికి చెందిన కన్నన్ కుమార్తె కోవైలోని ప్రైవేటు కళాశాలలో చదువుతోంది. ఆమె ఓ ఫైనాన్స్ సంస్థ ఉద్యోగి ప్రవీణ్‌ను ప్రేమిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో, ఆ విద్యార్థిని, తన స్నేహితులతో తీసుకున్న ఫొటో ఇటీవల తన ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేసింది. దాని విషయమై ప్రవీణ్‌కు ఆ విద్యార్థిని మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రవీణ్ ప్రవేశించి విద్యార్థినిపై కత్తితో దాడిచేశాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు చేరుకొనేలోపు ప్రవీణ్ పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన విద్యార్థినిని సమీపంలోని ఆస్పత్రికి తరలించగా, ఆమె అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసిన తరుణంలో, ప్రవీణ్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు.

కోవిలంబాక్కంలో ఇళ్లపై పెట్రోల్ బాంబులు

చెన్నై, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోవిలంబాక్కం ప్రాంతంలోని సత్యానగర్‌లో ఆదివారం అర్ధరాత్రి మూడిళ్లపై గుర్తు తెలియని దుండగులు పెట్రోలు బాంబులతో దాడి జరిపి పారిపోయారు. మొదట దుండగులు కోవిలంబాక్కం సత్యానగర్ 9వ వీధిలో నివసిస్తున్న మణికంఠన్ ఇంటిపై పెట్రోలు బాంబు విసిరారు. బాంబు పేలి మంటలు వ్యాపించాయి. మణికంఠన్, ఆయన కుటుంబ సభ్యులు బాంబు శబ్దం విని బయటకు పరుగెత్తారు. అదే వీధిలో ఉన్న అశ్విన్ అనే వ్యక్తి ఇంటిపై, భజనకోవిల్ రెండో వీధిలో నివసిస్తున్న గుహన్ అనే వ్యక్తి ఇంటిపై కూడా దుండగులు పెట్రోలు బాంబులతో దాడి చేసి బైకుపై పారిపోయారు. ఈ సంఘటనలపై కేసు నమోదు చేసుకున్న మేడవాక్కం పోలీసులు ఆయా ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీ ఆధారంగా బాంబు దాడి చేసినవారిని గుర్తించి అరెస్టు చేశారు.

రాయపేట ప్రభుత్వాస్పత్రిలో కొవిడ్ వార్డు

పెరంబూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపేట ప్రభుత్వాసుపత్రిలో కొవిడ్ ప్రత్యేక వార్డు ఏర్పాటైంది. 8 పడకలతో, వెంటిలేటర్, అత్యవసర మందులతో ఏర్పాటైన వార్డులో వైద్యులు, నర్సులు, సిబ్బంది ఉన్నారు. కొవిడ్ ముందస్తు చర్యల్లో భాగంగా కొవిడ్ వార్డు ఏర్పాటుచేసినట్లు ఆరోగ్య శాఖ తెలిపింది.

ఉప్మాకు బదులుగా 'పొంగల్'

● అల్పాహార పథకంలో మార్పు

ప్యారీస్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం అమలుపరుస్తున్న అల్పాహార పథకంలో ఉప్మాకు బదులుగా విద్యార్థులకు పొంగల్, సాంబార్ ఇవ్వాలని జిల్లా కలెక్టర్లకు సాంఘిక సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అల్పాహార పథకాన్ని మార్పు చేయనున్నట్లు 2023 జూన్‌లో సాంఘిక సంక్షేమశాఖ జీవో విడుదల చేసింది. అనంతరం ఈ పథకం అమలుపై పాఠశాల విద్యాశాఖ అధికారులు, టీచర్లు, పిల్లల అభిప్రాయాలను సేకరించిన ప్రభుత్వం ఉప్మాకు బదులుగా పొంగల్, సాంబారు పంపిణీ చేయనున్నట్లు గత ఏడాది మే 29న జీవో విడుదల చేసింది. ఈ నేపథ్యంలో, వేసవి సెలవుల అనంతరం సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమైన సందర్భంగా పాఠశాల ప్రాంగణాల్లో అల్పాహార పథకానికి అవసరమైన ఆహార పదార్థాలను సమకూర్చుకుని, ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు అల్పాహారాన్ని అందించాలని సాంఘిక సంక్షేమశాఖ కమిషనర్ ఆయా జిల్లాల అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థులతో కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఎమ్మెల్యే నందకుమార్, అధికారులు

వేలూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు సోమవారం పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులకు పూలు, చాక్లెట్లు అందజేసిన ఆహ్వానించిన ఉపాధ్యాయులు, వారిని తరగతి గదులకు పంపారు. పొయిగై బాలిక ఉన్నత పాఠశాలలో కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఎమ్మెల్యే నందకుమార్ హాజరై విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బ్యాగు అందించారు. జిల్లా ప్రధాన విద్యాధికారి దయాళన్, అనైకట్టు యూనియన్ కమిటీ ఉపాధ్యక్షుడు చిత్రకుమార పాండ్యన్, జిల్లా పంచాయతీల కమిటీ సభ్యుడు రాగప్రియ శ్రీనివాసన్, పొయిగై పంచాయతి అధ్యక్షుడు వెంకటేశన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయుడు

తిరుత్తణి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు ప్రారంభమైన రోజునే తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. దీనిపై పిల్లల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేయండి

● కార్యకర్తలకు టీవీకే జిల్లా కార్యదర్శి ఢిల్లీబాబు పిలుపు



సమావేశంలో టీవీకే పార్టీ నిర్వాహకులు

తిరుత్తణి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తమిళగ వెట్రి కళగం (టీవీకే) జిల్లా నాయకుల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి ఢిల్లీబాబు అధ్యక్షత వహించారు. ఇందులో డీఎండీకే, అన్నాడీఎంకే, డీఎంకే సహా పలు రాజకీయ పార్టీలను వీడి, టీవీకేలో చేరిన వారికి ఢిల్లీబాబు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి జ్ఞానం, కోశాధికారి స్టాలిన్, ఉపకార్యదర్శి సుకన్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పోరూర్: చతిరుముడివాక్కం, ఇందిరా నగర్, గురు నగర్, వివేకానంద నగర్, పలంతండలం, నాగాస్ వీధి, ఎరుమైయూర్, క్రిజర్, కిష్కింద రోడ్డు, రాజీవ్ నగర్

పూందమల్లి: పూందమల్లి ట్రంక్ రోడ్డు, ఆంజనేయ ఆలయ వీధి, వైదీశ్వరన్ ఆలయ వీధి, రామానుజకూడం రోడ్డు, సుందర్ నగర్, న్యూ స్ట్రీట్, గంగాసారథి నగర్, పిళ్లయార్ ఆలయ వీధి

పెరుంగళత్తూర్: కురింజినగర్ సత్యమూర్తి వీధి, తిరుపూర్ కుమరన్ వీధి, కస్తూరిభాయ్ వీధి, అముదం నగర్, శఠగోపన్ నగర్, తంగరాజ్ నగర్, మీనాక్షి అవెన్యూ, కన్నన్ అవెన్యూ, వసంతం అవెన్యూ, విష్ణు నగర్, ఈబీ కాలని

మెదడు నిర్జీవమైన యువకుడి అవయవాల దానం



సురేందర్ (ఫైల్‌ఫొటో)

వేలూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మెదడు నిర్జీవమైన యువకుడు అవయవ దానంతో పలువురు పునర్జన్మ పొందారు. అరపాక్కం శివరాజపురానికి చెందిన రాజ్‌కుమార్ చిన్న కుమారుడు సురేందర్ (23) గత నెల 31వ తేది వేలూరు సమీపంలో ద్విచక్రవాహనంపై వస్తూ ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన రాజ్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. ఈ నెల 1వ తేది రాజ్‌కుమార్ మెదడు నిర్జీవమైనట్లు నిర్ధారించిన వైద్యులు, అతని తల్లిదండ్రులకు తెలియజేశారు. తల్లిదండ్రుల అంగీకారంతో రాజ్‌కుమార్ గుండె, ఊపిరితిత్తులు చెన్నై అపోలో ఆసుపత్రికి, పేగులు, ఒక కిడ్నీ వేలూరు, రాణిపేట సీఎంసీ ఆస్పత్రికి, మరో కిడ్నీ చెన్నై కాళియప్ప ఆస్పత్రి, నేత్రాలు వేలూరు సీఎంసీ ఆసుపత్రికి అందజేసినట్లు సీఎంసీ పీఆర్వో తెలిపారు.

కొవిడ్ లక్షణాలున్న బాలుడికి క్వారంటైన్

పెరంబూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ లక్షణాలు బయటపడిన తొమ్మిదేళ్ల బాలుడిని ఇంట్లోనే క్వారంటైన్‌లో ఉండాలని వైద్యులు సూచించారు. స్థానిక పల్లికరనై అంబాళ్ నగర్‌కు చెందిన తొమ్మిదేళ్ల బాలుడు జ్వరం, జలుబు, దగ్గు లక్షణాలతో ఆస్పత్రికి వెళ్లగా, వైద్యుల పరీక్షలో కొవిడ్ లక్షణాలు నిర్ధారణ అయ్యాయి. స్వల్ప లక్షణాలు కావడంతో వైద్యుల సూచన మేరకు బాలుడిని ఇంట్లోనే క్వారంటైన్‌లో ఉంచారు. కాగా, ప్రస్తుతం వ్యాపిస్తున్న ఒమైక్రాన్ వైరస్ ప్రాణాంతకం కాదని, అందువల్ల ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని ఆరోగ్య శాఖ తెలిపింది.

పల్లవుల కాలం నాటి విగ్రహాలు లభ్యం



లభ్యమైన శివలింగం

పెరంబూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి జిల్లా ఉళుందూర్‌పేట సమీపంలోని కె.నత్తం గ్రామంలోని చెరువు గట్టు పటిష్ఠం చేయడం కోసం తవ్వకాలు చేపట్టగా ప్రాచీన విగ్రహాలు లభ్యమయ్యాయి. ఐదడుగుల శివలింగం, జేష్ఠాదేవి విగ్రహం, కొట్రవై దేవి విగ్రహాలు బయల్పడ్డాయి. ఈ విగ్రహాలను పరిశీలించిన కోయంబత్తూర్‌కు చెందిన శిలాశాసనాల పరిశోధకులు మాట్లాడుతూ... 1200 ఏళ్ల క్రితం పల్లవ రాజుల కాలానికి చెంది ఉంటాయని తెలిపారు. కాగా, విగ్రహాలకు గ్రామస్తులు అభిషేకాలు నిర్వహించారు.

రైలుకిందపడి కొడుకు సహా తల్లి ఆత్మహత్య

చెన్నై, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు రైల్వేస్టేషన్ సమీపంలో నాలుగేళ్ల కుమారుడితో పాటు ఓ తల్లి రైలుకిందపడి ఆత్మహత్య చేసుకుంది. తిరువారూరు జిల్లా తిరుత్తురైపూండి తాలూకా వేలూరు ప్రాంతానికి చెందిన అయ్యప్పన్ భార్య విజయలక్ష్మి (26) కుటుంబ కలహాల కారణంగా ఇల్లు విడిచి తన కుమారుడు యాగేశ్వరన్ (4)ని తీసుకుని తిరుప్పూరు చేరుకున్నారు. తిరుప్పూరు రైల్వేస్టేషన్ వద్ద సోమవారం వేకువజామున వేగంగా వెళుతున్న రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. ఈ సమాచారం అందుకుని రైల్వే పోలీసులు పట్టాలపై పడి ఉన్న మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు.

కార్పొరేషన్ పాఠశాలలో పెరిగిన అడ్మిషన్లు

పెరంబూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పాఠశాలలో గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది అడ్మిషన్లు రెండురెట్లు పెరిగాయి. జీసీసీ పరిధిలోని 417 పాఠశాలల్లో సుమారు లక్ష మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ మార్చి 1వ తేది నుంచి ప్రారంభమైంది. కార్పొరేషన్ పాఠశాలల్లో గత విద్యా సంవత్సరంలో 6వేల మంది అడ్మిషన్లు పొందగా, ప్రస్తుత విద్యా సంవత్సరం 16,491 మంది చేరినట్లు జీసీసీ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

'ఉపాధి హామీ' కోసం కలెక్టరేట్ ముట్టడి



ఆందోళన చేస్తున్న దివ్యాంగులు

ప్యారీస్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని కోరుతూ దివ్యాంగులు సోమవారం విల్లుపురం కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. విల్లుపురంజిల్లాలో వల్లం, మేల్‌మళయనూరు, తిరువెన్నైనల్లూరు పంచాయతీల్లో దివ్యాంగులకు వంద రోజుల ఉపాధి కల్పించడంలేదని ఆ జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం తరుపున రాష్ట్రప్రభుత్వానికి, కలెక్టర్‌కు పలుమార్లు వినతిపత్రాలను సమర్పించినా.. ఎలాంటి ఫలితంలేదని సమాచారం. దీంతో దివ్యాంగుల సంఘం పిలుపు మేరకు సుమారు వంద మందికి పైగా దివ్యాంగులు విల్లుపురం జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆందోళనకారులతో అధికారులు చర్చించి సమస్యను పరిష్కరింపజేస్తామని హామీ ఇచ్చారు.

డంపింగ్ యార్డ్‌లో ఫైర్‌బాయిలర్ ఏర్పాటుపై అన్నాడీఎంకే వినూత్న ధర్నా



పుర్రెల మాలలు ధరించి అన్నాడీఎంకే నేతల నిరసన

ప్యారీస్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొడుంగయూర్ డంపింగ్ యార్డులో ప్లాస్టిక్ వ్యర్థాలను దహనం చేసే ఫైర్ బాయిలర్ ప్లాంటు నిర్వహణను వ్యతిరేకిస్తూ అన్నాడీఎంకే శ్రేణులు సోమవారం వినూత్న నిరసన తెలిపారు. ఉత్తర చెన్నై జిల్లా అన్నాడీఎంకే కార్యదర్శి ఆర్ఎస్ రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో పుర్రెల మాలలు ధరించి రాష్ట్రప్రభుత్వ వైఖరిని తప్పుబడుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి, మాజీమంత్రి వలర్మతి మాట్లాడుతూ.. కొడుంగయూర్ డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల ఆరోగ్యం గురించి ఆలోచించకుండా ఫైర్ బాయిలర్ ప్లాంట్‌ను ఏర్పాటుచేయడం సరికాదన్నారు. కొడుంగయూర్ ప్రాంతంలో శ్మశాన వాటిక ఏర్పాటుకు అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో రూ.6 కోట్లు మంజూరయ్యాయని, అయితే ఆ నిధులను డీఎంకే ప్రభుత్వం మరో పథకానికి వినియోగించిందని ఆరోపించారు.

● రాజ్యసభ ఎన్నికలు..

తొలిరోజు ఇద్దరు ఇండిపెండెంట్ల నామినేషన్

చెన్నై, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి సోమవారం ఉదయం నుండి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 9 వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. 10న నామినేషన్ల పరిశీలన, 12న ఉపసంహరణ జరుగుతుది. ఒక వేళ ఆరుగురి కంటే ఎక్కువ మంది పోటీలో ఉంటే ఈ నెల 19న బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికల్లో డీఎంకే తరపున న్యాయవాది పి.విల్సన్, ఎస్ఆర్ శివలింగం, కవయిత్రి సల్మా, ఎంఎన్ఎం అధ్యక్షుడు కమల్‌హాసన్ పోటీ చేయనున్నారు. అన్నాడీఎంకే తరపున ఎమ్మెల్యే ధనపాల్, పార్టీకి చెందిన న్యాయవాది ఇన్బదురైని అభ్యర్థులుగా ప్రకటించారు. ఈ ఆరుగురు ఈ నెల 4 లేదా 5 తేదీలలో నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఈ ఆరుగురూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం ఉంది.

పద్మరాజన్ నామినేషన్..

సోమవారం ఉదయం నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగానే సేలం జిల్లా మేట్టూరుకు చెందిన ఎన్నికల వీరుడు పద్మరాజన్ నామినేషన్ వేశారు. ఎన్నికల అధికారి సుబ్రమణ్యంకు ఇండిపెండెంట్‌గా నామినేషన్ సమర్పించారు. ఇదే విధంగా తెలంగాణకు చెందిన కంతేశయనా అనే వ్యక్తి కూడా ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారు.

లంచం కేసులో 8 మందికి జైలుశిక్ష

పెరంబూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకున్న కేసుల్లో, గత నెల మాత్రమే సబ్ రిజిస్ట్రార్, వీఏఓ సహా 8 మందికి ప్రభుత్వ అధికారులకు న్యాయస్థానాలు జైలుశిక్ష విధించాయి. ప్రజల ఫిర్యాదు మేరకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీబీ ఆకస్మిక తనిఖీలు చేపట్టి, లంచం తీసుకుంటున్న అధికారులు, సిబ్బందిని అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు చేపడుతోంది.. ఆ ప్రకారం, పుదుకోట జిల్లా సబ్ రిజిస్ట్రార్ శశికళ, పత్రాల రిజిస్ట్రేషన్‌కు రూ.8,000 లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఆమెకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.8,000 జరిమానాను కోర్టు విధించింది. ఇక, తూత్తుకుడి ఏఈ తిరుపతికి రూ.35 వేలు లంచం తీసుకున్న కేసులో, నాలుగేళ్ల జైలుశిక్ష, రూ.20 వేలు జరిమానా విధించారు. కాంచీపు రం హెడ్ కానిస్టేబుల్ మదియళగన్ రూ.3 వేలు తీసుకున్న కేసులో మూడేళ్ల జైలుశిక్ష, రూ.20 వేల జరిమానా, పుదుకోట జిల్లా అలంగుడి వీఏఓ రవి రూ.2,500 లంచం తీసుకున్న కేసులో రెండేళ్ల జైలుశిక్ష, రూ.3 వేల జరిమానా, పుదుకోట ఏఈ తెన్నరసు రూ.5 వేలు లంచం తీసుకున్న కేసులో మూడేళ్ల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా ఆయా కోర్టులు విధించాయి. అలాగే, సాంఘిక సంక్షేమ శాఖ గ్రామీణాభివృద్ధి అధికారి ఆరుముగతాయ్ రూ.2 వేలు లంచం తీసుకున్న కేసులో మూడేళ్ల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా, దిండుగల్ సెందురై వీఏఓ బవురుద్దీన్ రూ.1,200 లంచం తీసుకున్న కేసులో రెండేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా, చెన్నై కార్పొరేషన్ లైసెన్స్ ఇన్‌స్పెక్టర్ గజేంద్రన్ రూ.1,000 లంచం తీసుకున్న కేసులో ఐదేళ్ల జైలుశిక్ష, రూ. లక్ష జరిమానాను ఆయా కోర్టులు విధించాయి.

రూ.840 కోట్ల ధాన్యం వర్షార్పణం

● స.హ.చట్టం ద్వారా వెలుగులోకి

ప్యారీస్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ ఐదేళ్లలో రూ.840 కోట్ల విలువైన ధాన్యం బస్తాలు వర్షంలో తడిసి వృథా అయినట్లు సమాచార హక్కు చట్టం ద్వారా తెలిసింది. రైతుల నుంచి కొనుగోలు చేసే ధాన్యం బస్తాలను పౌరసరఫరాల శాఖ నిర్వహణలోని మార్కెటింగ్ కమిటీ భవనాల్లో భద్రపరుస్తుంటారు. అందులో భాగంగానే 2019 నుండి 2024 వరకు మార్కెటింగ్ కమిటీల్లోని గోదాముల్లో భద్రపరచిన 3.72 మెట్రిక్ టన్నుల ధాన్యం బస్తాలు వర్షంలో తడవటంతో, ప్రభుత్వానికి సుమారు రూ.810 కోట్ల మేర నష్టం ఏర్పడినట్లు సమాచార హక్కు చట్టంలో స్పష్టమైంది. మార్కెటింగ్ కమిటీల్లో వసతుల కరువు, వర్షపు నీరు చేరకుండా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం, ముఖ్యంగా అధికారుల నిర్లక్ష్యమే కారణమని రైతులు ఆరోపిస్తున్నారు.

తేనెటీగల దాడిలో ముగ్గురికి గాయాలు





తిరుత్తణి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని చందన గోపాలపురంలో జరిగిన ఘటనకు సంబంధించి వివరాలిలా.. సోమవారం ఉదయం చెరకు తోటలో పనికి వెళ్ళిన శాంతి, శంకర్, కమలకన్నన్ అనే ముగ్గురిపై కొండ తేనెటీగలు దాడి చేశాయి. వెంటనే అక్కడి గ్రామస్తులు అంబులెన్స్ ద్వారా గాయపడిన వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు.

సాంకేతిక లోపంతో తూత్తుకుడి విమానం రద్దు

ప్యారీస్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుండి తూత్తుకుడి బయలుదేరాల్సిన ఇండిగో విమానం సాంకేతిక లోపంతో రద్దు చేసినట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు. సోమవారం 72 మంది ప్రయాణికులతో చెన్నై నుంచి తూత్తుకుడికి బయలుదేరే ఇండిగో విమానాన్ని పైలెట్ టేకాఫ్ చేసేందుకు యత్నించాడు. అయితే ఆ విమానంలో సాంకేతిక లోపాన్ని ముందుగానే గుర్తించిన పైలెట్ అందులో ప్రయాణికులను కిందకు దింపారు. అనంతరం విమానాశ్రయ సాంకేతిక బృందం సాంకేతిక లోపాన్ని సరిచేసేందుకు నిమగ్నమైంది.. రద్దైన విమానంలో వెళ్ళాల్సిన ప్రయాణికులను ఇండిగో సంస్థ మరో విమానంలో తూత్తుకుడికి పంపింది.

తిరుత్తణి ఆలయంలో చిన్నారులకు ఆవుపాలు




శిశువు తల్లికి పాలు అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

తిరుత్తణి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దేవాదాయశాఖ పరిధిలోని పది పుణ్యక్షేత్రాల్లో చిన్నారులకు ఆవుపాలు అందిస్తామని సీఎం స్టాలిన్ గత అసెంబ్లీ సమావేశంలో ప్రకటించారు. ఈ మేరకు తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి ఆలయానికి వచ్చే భక్తుల పిల్లలకు సోమవారం ఉదయం ఆలయ నిర్వాహకులు పాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వామి దర్శనానికి వచ్చిన తల్లిదండ్రులు క్యూలైన్‌లో నిలబడి పాలు తీసుకున్నారు.

ఆగస్టు 2న చెన్నైలో సింఫనీ ప్రదర్శన

● ఘనంగా ఇళయరాజా 83వ జన్మదిన వేడుకలు

● సీఎం స్టాలిన్ సహా పలువురి శుభాకాంక్షలు



అడయార్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): 'ఇసై జ్ఞాని' ఇళయరాజా తన పుట్టిన రోజు వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. కోడంబాక్కంలోని ఇళయరాజా స్టూడియోలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయనకు పలువురు సినీ ప్రముఖులు స్వయంగా విషెస్ చెప్పారు. అలాగే, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా ఇళయరాజా మీడియాతో మాట్లాడుతూ, 'పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ఉపరాష్ట్రపతి జగ్దీష్ ధన్కర్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి స్టాలిన్ తదితర సినీ రాజకీయ ప్రముఖులకు ధన్యవాదాలు తెలిపారు. కాగా, తన బర్త్‌డే సందర్భంగా ఇళయరాజా శుభవార్త చెప్పారు. లండన్‌లో సింఫనీ అరంగేట్రం చేశాను. దాన్ని ఇక్కడ ఉండే వారు చూడలేకపోయారు. అందువల్ల లండన్‌కు చెందిన రాయల్ వాయిద్య కళాకారుల బృందాన్ని ఇక్కడకు పిలిపించి, ఆగస్టు 2వ తేదీ మరోమారు సింఫనీ పదర్శించనున్నాను. నా నిర్ణయానికి ముఖ్యమంత్రి స్టాలిన్ అభినందిస్తూ స్వాగతించారు. నేను స్వరపరిచిన పాటలన్నీ ఎలాంటి వాతావరణం, పరిస్థితుల్లో ఉన్నప్పటికీ ఆలకించవచ్చు. నా పాటలు వింటుంటే మద్యం లేకుండానే మత్తులోకి జారుకోవచ్చు' అని పేర్కొన్నారు. ఇదిలావుంటే, ఇళయరాజాను కలిసి బర్త్‌డే విషెస్ చెప్పిన వీసీకే ప్రధాన కార్యదర్శి తోల్ తిరుమావళవన్ మాట్లాడుతూ, ఇళయరాజాకు భారతరత్న ఇవ్వాలని ఎప్పటి నుంచో కోరుతున్నాం. ఇపుడు మరోమారు విజ్ఞప్తి చేస్తున్నారు. త్వరలోనే ఈ కోరికను కేంద్రం నెరవేర్చుతుందని గట్టిగా నమ్ముతున్నాం' అని పేర్కొన్నారు. వాస్తవంగా ఇళయరాజా పుట్టిన తేదీ జూన్ 3. అదే రోజు దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎం.కరుణానిధి జన్మదినం కావడంతో ఇళయరాజా తన పుట్టిన రోజు వేడుకలను ఒక రోజు ముందు జరుపుకోవడం ప్రారంభించారు. దీనికి కారణం.. ఇళయరాజాకు 'ఇసైజ్ఞాని' అనే బిరుదును కరుణానిధి బహూకరించడమే కారణం

'అక్యూస్డ్'లో నటించడం నా భాగ్యం

● నటుడు ఏఎల్.ఉదయ

పాతికేళ్ళ సినిమా కెరీర్‌లో 'అక్యూస్డ్' వంటి చిత్రంలో నటించడం తన భాగ్యంగా భావిస్తున్నట్టు హీరో ఏఎల్.ఉదయ అన్నారు. జేషన్ స్టూడియోస్, సచిన్ సినిమాస్ సహకారంతో దయాకరన్ సినీ ప్రొడక్షన్స్, ఎంవై స్టూడియోస్ పతాకంపై ఏఎల్ ఉదయ, దయా ఎన్.పన్నీర్‌సెల్వ, ఎం.తంగవేల్ కలిసి నిర్మించిన చిత్రం 'అక్యూస్డ్'. ఈ సినిమా ఆడియో, ట్రైలర్ రిలీజ్ నగరంలో తాజాగా జరిగింది. ఇందులో ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, తమిళ సినీ నిర్మాతల సంఘం అధ్యక్షుడు ఎస్.మురళి రామస్వామితో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొని ఆడియో రిలీజ్ చేశారు. ఉదయ, అజ్మల్, యోగిబాబు కలిసి నటించిన ఈ చిత్రానికి ప్రభు శ్రీనివాస్ దర్శకత్వం వహించగా, కన్నడ నటి జాన్విక హీరోయిన్‌గా నటించారు. ఈ సందర్భంగా హీరో ఉదయ మాట్లాడుతూ, 'నా పాతికేళ్ళ సినీ కెరీర్‌లో ఈ మూవీ ఎంతో ముఖ్యం. నిర్మాతలకు ధన్యవాదాలు. దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించారు. మూవీ విజయానికి మీడియా సపోర్టు చేయాలని కోరుతున్నాం' అని కోరారు. ఆర్కే సెల్వమణి మాట్లాడుతూ, 'హీరో ఉదయకు మంచి పేరు వచ్చింది. దాన్ని కాపాడుకుంటూ ముందుకు తీసుకెళ్ళడమే ఇపుడు అతడిముందున్న సవాల్. ఎందోమంది ప్రతిభావంతులైన నటీనటులు, కళాకారులు ఈ సినిమా కోసం పని చేశారు. వారందరికీ ధన్యవాదాలు' అన్నారు. నిర్మాత ఏఎల్ అళగప్పన్ మాట్లాడుతూ, 'నా కుమారుల ప్రయత్నానికి నేను అండగా ఉంటాను. వారి నిర్ణయాల్లో జోక్యం చేసుకోను. ఎవరి సాయం తీసుకోకుండా ఇండస్ట్రీలో ఉదయ సత్తా చాటుతున్నాడు. ఇది నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తుంది' అని అన్నారు. హీరో అజ్మల్ మాట్లాడుతూ, 'ఈ మూవీలో నా పాత్ర నాకు ఎంతగానో నచ్చింది. నాకు, ఉదయకు మంచి కెమిస్ట్రీ ఉంది. మూవీని అద్భుతంగా తెరకెక్కించిన దర్శకుడుకి ధన్యవాదాలు' తెలిపారు. చిత్ర దర్శకుడు ప్రభు శ్రీనివాస్ మాట్లాడుతూ, 'చిత్రపరిశ్రమలోని ప్రముఖులంతా ఈ ఆడియో రిలీజ్ వేడుకకు రావడం చాలా సంతోషంగా ఉంది. ఈ మూవీ స్క్రిప్టును వినిపించగానే హీరో ఉదయ్ తన ప్రాజెక్టులన్నీ పక్కనబెట్టి మూవీ కోసం పనిచేశారంటూ ఆయనకు ప్రత్యేకంగా ధన్యవాదాలు' తెలిపారు.



ఆడియో ఆవిష్కరణ

చిత్రజ్యోతి

ఫైట్స్ లేని గ్యాంగ్‌స్టర్ మూవీ 'దావూద్'

సాధారణంగా గ్యాంగ్‌స్టర్ చిత్రాలంటే రక్తపాతంతో కూడిన భారీ యాక్షన్ సన్నివేశాలుంటాయి. అయితే, టీయూఆర్‌ఎం ప్రొడక్షన్ హౌస్ నిర్మించిన గ్యాంగ్‌స్టర్ మూవీ 'దావూద్'లో మాత్రం ఒక్క యాక్షన్ సన్నివేశం కూడా లేదు. ఎస్.ఉమామహేశ్వరి నిర్మించిన రెండో చిత్రం. 'పరోల్', 'ఉడన్‌పాల్', 'పెంక్వీన్', 'సేతుపతి' వంటి చిత్రాల్లో ముఖ్య పాత్రలు పోషించిన లింగా ఈ చిత్రంలో హీరోగా నటించారు. సారా అచార్ అనే వర్ధమాన నటి హీరోయిన్‌గా వెండితెరకు పరిచయమవుతున్నారు. ఇతర పాత్రల్లో దిలీపన్, రాధారవి, సాయి దీనా, సారా, వయ్యాపురి, అర్జెయ్, అభిషేక్, అనంత్ నాగ్ తదితరులు నటించారు. కథ, స్క్రీన్‌ప్లే సమకూర్చి దర్శకత్వం వహించిన ప్రశాంత్ రామన్‌కు ఇదే తొలి చిత్రం కావడం గమనార్హం. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'సాధారణంగా ఛేజింగ్, పోరాట సన్నివేశాలలో గ్యాంగ్‌స్టర్ చిత్రాలు ఉంటాయి. వీటికి పూర్తి భిన్నంగా ఈ సినిమాను తెరకెక్కించాం. ఇప్పటివరకు ఎవరూ తెరపై చూడని అనుభూతిని పొందుతారు. ముఖ్యంగా నేటి యువతకు నచ్చే విధంగా ఈ సినిమా ఉంటుంది. చివరి దశ చిత్రీకరణ జరుగుతోందనిని వివరించారు.



'దావూద్'లో ఓ దృశ్యం

దర్శకుడు విక్రమ్ సుకుమారన్ హఠాన్మరణం



విక్రమ్ సుకుమారన్ (ఫైల్‌ఫొటో)

'మదయానై కూట్టమ్', 'రావణ కోట్టం' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన విక్రమ్ సుకుమారన్ (47) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆదివారం రాత్రి మదురై నుంచి చెన్నై వచ్చేందుకు బస్సు ఎక్కుతుండగా, ఒక్కసారిగా ఆయన గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారు. వెంటనే అతడిని హుటాహుటిన సమీపంలోని ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆయన తుదిశ్వాస విడిచినట్టు వైద్యులు వెల్లడించారు. మదురైలోని ఒక సినీ నిర్మాతకు తన కొత్త ప్రాజెక్టుకు సంబంధించిన కథ వినిపించి తిరిగి చెన్నై వస్తుండగా ఈ విషాదకర ఘటన జరిగింది. భౌతికకాయాన్ని చెన్నై నగర శివారు ప్రాంతమైన రెడ్‌హిల్స్ ఎల్లమ్మాళ్‌పేట, పెరుమాల్ కోయిల్ వీధిలో ఉన్న ఆయన స్వగృహానికి తరలించి, సినీ ప్రముఖులు, అభిమానుల సందర్శనార్థం ఉంచారు. అంత్యక్రియలను సోమవారమే పూర్తి చేశారు. విక్రమ్ సుకుమారన్ మృతికి నడిగర్ సంఘం నిర్వాహకులు, పలువురు సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలియజేశారు.

అపోలో హెల్త్ రిసోర్సెస్ సహకారంతో శ్రీరామచంద్రా వర్శిటీలో జినోమిక్స్ కోర్సు



ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తున్న వర్శిటీ వీసీ ప్రొఫెసర్ ఉమా శేఖర్, అపోలో నాలెడ్జ్ సీఈఓ శివరామకృష్ణన్ వెంకటేశ్వరన్ తదితరులు

చెన్నై, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జన్యుశాస్త్రం (జినోమిక్స్)లో ప్రత్యేక కోర్సు ప్రవేశపెట్టే దిశగా అపోలో హెల్త్ రిసోర్సెస్ లిమిటెడ్ (ఏహెచ్ఆర్ఎల్), పోరూరులోని శ్రీరామచంద్రా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సంస్థ భాగస్వామ్యం ఏర్పరచుకున్నాయి. ఆ మేరకు అడ్వాన్స్‌డ్ సర్టిఫికేషన్ ఇన్ జినోమిక్స్ (ఏసీజీ) ప్రోగ్రామ్‌కు శ్రీకారం చుట్టాయి. యేడాది ఫుల్‌టైమ్ కోర్సు ఆగస్టు నుంచి శ్రీరామచంద్రా వర్శిటీలో ప్రారంభమవుతాయి. ఈ కోర్సులో చేరటానికి ఎమ్మెస్సీ ఎంటెక్ విద్యార్హతగా నిర్ణయించారు. అభ్యర్థులు హ్యూమన్ జెనెటిక్స్, బయోమెడికల్ జెనెటిక్స్, బయోటెక్నాలజీ, బయోమెడికల్ సైన్సెస్, స్టెమ్‌సెల్ సైన్సెస్, క్లినికల్ రిసెర్చ్, జెనెటిక్ ఇంజనీరింగ్, మాలిక్యులర్ బయాలజీ, బయోకెమెస్ట్రీ పాఠ్యాంశాల్లో ఏదైనా ఒకటి చదివి ఉండాలని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ రెండు సంస్థలు ఒప్పంద కార్యక్రమంలో శ్రీరామచంద్రా వర్శిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమా శేఖర్, అపోలో నాలెడ్జ్ సీఈఓ శివరామకృష్ణన్ వెంకటేశ్వరన్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్. సెంథిల్‌కుమార్, హ్యూమన్ జెనెటిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.







తెరుచుకున్న బడులు.. ఉత్సాహంగా వచ్చిన విద్యార్థులు

వేసవి సెలవుల తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ఉదయం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఉదయం తొమ్మిది గంటలకు పాఠశాలలు ప్రారంభమయ్యాయి. వీరందరికీ 217 కోట్ల పాఠ్యపుస్తకాలు, 35లక్షల మంది బాలబాలికలకు ఉచిత యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. రాష్ట్రంలోని 32 వేల ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరూ సోమవారం ఉదయం పాఠశాలలకు తరలివచ్చారు. వీరిని స్వాగతిస్తూ పలు స్కూళ్లలో ప్రవేశద్వారాల వద్ద పూలమాలలతో తోరణాలు కట్టారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రార్థన ముగిసిన తర్వాత విద్యార్థులందరూ తరగతి గదులకు వెళ్ళారు. ఆ తర్వాత ఉపాధ్యాయులు వారికి పాఠాలు బోధించారు.

\- చెన్నై,ఆంధ్రజ్యోతి















ప్రముఖ నేతలు, సినీనటుల వేషధారణలో కళాకారులు - సారె తీసుకొస్తున్న జల్లికట్టు ఎద్దులు

అమ్మో... మేనమామ సారె...!

పది ఎద్దుల బండ్లు, పది ట్రాక్టర్లలో తరలింపు

పెరంబూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వివాహ వేడుకల ఊరేగింపునకు ధీటుగా మేనమామ తీసుకొచ్చిన సారే ఊరేగింపు చూపరులను ఆశ్చర్యానికి గురిచేసింది. అక్క కుమార్తె, కుమారుడికి చెవులు కుట్టే సమయంలో మేనమామ సారె సమర్పించడం ఆనవాయితీ. ఆ ప్రకారం, దిండుగల్ గాంధీ మార్కెట్లో టమోటా వ్యాపారి అయిన సంతోష్ కుమారుడు యువన్ శ్రీహరికి చెవులు కుట్టే వేడుక ఆదివారం దిండుగల్‌లోని ఓ కల్యాణ మండపంలో జరిగింది. యువన్ శ్రీహరి మేనమామ ముత్తుకుమార్ ప్రేమతో సారెగా 1,008 రకాల వస్తువులు తీసుకొచ్చారు. పది ఎడ్ల బండ్లు, పది ట్రాక్టర్లలో ఏడాదికి సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం బస్తాలు, స్వీట్లు, కూరగాయాలు, పలురకాల పండ్లు, కొత్త బట్టలు, నగదు, బంగారు ఆభరణాలతో ఊరేగింపుగా తరలివచ్చాడు. ఊరేగింపు ముందు పల్లకీలో యువన్ శ్రీహరిని కూర్చుండబెట్టి గరగాట్టం, ఓయిలాట్టం, చెక్క గుర్రం సహా పలు ప్రదర్శనలతో తరలి వచ్చారు. అలాగే, పొన్ ముత్తురామలింగ దేవర్, ముఖ్యమంత్రి స్టాలిన్, నటులు రజనీకాంత్, కమల్‌హాసన్, వడివేలు తదితర రుల వేషధారణతో కళాకారులు ముందు నిలిచారు. సారెలో మూడు జల్లికట్టు ఎద్దులు, గొర్రెలు, మేకలు కూడా ఉన్నాయి. అనంతరం యువన్ శ్రీహరిని మేనమామ ముత్తుకుమార్ ఒడిలో కూర్చోబెట్టి చెవులు కుట్టే కార్యక్రమం నిర్వహించారు.



ఊరేగింపుగా సారె తీసుకువస్తున్న దృశ్యం

సోమవారం రాజ్‌భవన్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా తిలకిస్తున్న రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి. చిత్రంలో వివిధ రంగాలకు చెందిన తెలుగు ప్రముఖులు కూడా వున్నారు.



కాట్పాడిలోని చిత్తూరు బస్టాండ్ సమీపంలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం బంగారు కవచంతో భక్తులకు దర్శనమిస్తున్న స్వామి వారు



బార్కో కలర్ గ్రేడింగ్ ఆవిష్కరణ



బార్కో కలర్ గ్రేడింగ్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు

అడయార్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): లేజర్ సినిమాలో గ్లోబల్ లీడర్‌గా ఉన్న బార్కో, మీడియా, ఎంటర్‌టైన్మెంట్ పయనీర్‌గా ఉన్న ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్స్ సంయుక్తంగా దేశంలోనే తొలిసారి బార్కో కలర్ గ్రేడింగ్ సదుపాయాన్ని ఆవిష్కరించాయి. ఈ రెండు సంస్థల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం సినిమా పోస్ట్ ప్రొడక్షన్‌ను మరోస్థాయికి తీసుకెళుతుందని భావిస్తున్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమం సందర్భంగా ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్స్ అభిషేక్ ప్రసాద్ అక్కినేని మాట్లాడుతూ, దేశంలోనే తొలిసారి హెచ్‌డీఆర్ బార్కో లేజర్ ప్రొజెక్షన్ కలర్ గ్రేడింగ్ సౌకర్యాన్ని ప్రారంభించడంతో చిత్ర దర్శక నిర్మాతలు తమ కళాత్మక దృష్టిని అత్యంత ఖచ్చితత్వంతో పూర్తి చేసుకునేందుకు ఈ ఆవిష్కరణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బార్కోతో తమ అవగాహన ఒప్పందం అత్యాధునిక పరిష్కారాలతో పోస్ట్ ప్రొడక్షన్ విభాగం సరికొత్త పుంతలు తొక్కుతుందన్నారు.

ఘనంగా మొగప్పేర్ తెలుగు అసోసియేషన్ వార్షికోత్సవం



అతిథులతో ఎంటీసీఎస్ఏ నిర్వాహకులు

ప్యారీస్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మొగప్పేర్ తెలుగు కల్చరల్, సోషల్ అసోసియేషన్ (ఎంటీసీఎస్ఏ) 12వ వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్నానగర్‌లోని చిన్నస్వామి కల్యాణమండపంలో ఆదివారం రాత్రి ఎంటీసీఎస్ఏ గౌరవాధ్యక్షుడు డాక్టర్ గిరి హనుమంతరావు సారథ్యం వహించిన ఈ వేడుక ప్రముఖుల ప్రసంగాలు, చిన్నారుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆద్యంతం అలరించింది. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.వీరభద్రరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.నిర్మల్ చందర్ స్వాగతం పలికి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. ముఖ్యఅతిథులుగా ఏటీఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ సీఎంకే రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్.నందగోపాల్, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరెక్టర్ జె.విజయలక్ష్మి, హైకోర్టు అడ్వకేట్ వి.దీపన్‌రాజ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఖేల్ ఇండియా పోటీల్లో రాణించిన క్రీడారులను, టెన్త్, ఇంటర్‌లో మెరిట్ సాధించిన విద్యార్థులను అభినందిస్తూ, జ్ఞాపికలతో సత్కరించారు. కోశాధికారి జి.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఈ.సురేష్‌బాబు, టీఎంకే కుమార్ తదితరులు పాల్గొన్నారు.

8న తిరుపతిలో హరిహరవీరమల్లు ప్రీ రిలీజ్ వేడుక

సినీ దిగ్గజాలు చిరంజీవి, రజనీకాంత్ రాక

తిరుపతి అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హీరోగా నటించిన 'హరిహర వీరమల్లు' ప్రీ రిలీజ్ వేడుక ఈనెల 8న తిరుపతి ఎస్వీయూ తారక రామ మైదానంలో జరగనున్నట్లు సమాచారం. ఈ మేరకు అనుమతి కోసం చిత్రనిర్మాత ఏఎం రత్నం ఎస్వీయూ వీసీకి లేఖ ఇచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యఅతిథులుగా తెలుగు, తమిళ సినీ దిగ్గజాలు మెగాస్టార్ చిరంజీవి. సూపర్‌స్టార్ రజనీకాంత్, పవన్‌కల్యాణ్‌తో పాటు నటీనటులు నిధిఅగర్వాల్, బాబిడియోల్, సత్యరాజ్, మరో నిర్మాత దయకర్‌రావు హాజరు కానున్నట్లు సమాచారం. వీరంతా ఈవెంట్ ముగిశాక రాత్రికి తిరుమల చేరుకుని, మరుసటి రోజు ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నట్లు సమాచారం.



సంజయ్ మూర్తి

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జూన్2 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో. కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు, కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా సంజయ్ మూర్తి, జనసేన స్టేట్ జనరల్ సెక్రటరీ బొలిశెట్టి సత్యనారాయణ, సినీనటుడు శుభలేఖ సుధాకర్, ఆయన సతీమణి, గాయని ఎస్పీ శైలజ ఉన్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



శుభలేఖ సుధాకర్, శైలజ


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి ప్యాలెస్‌లో 5 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.46 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,031

తలనీలాలు సమర్పించినవారు: 32,936



వినుడు.. మా గోడు

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 299 వినతులు ● రెవెన్యూ శాఖవే 158

● సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం చూపొద్దన్న కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తమ గోడు పట్టించుకుని, సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీదారులు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజలు తరలివచ్చారు. వీరితో కలెక్టరేట్ కిక్కిరిసింది. వివిధ సమస్యలపై 299 అర్జీదారులు అందగా, అందులో 158 రెవెన్యూశాఖవే కావడం గమనార్హం. ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని, ఇందులో నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవంటూ కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను హెచ్చరించారు. పరిష్కరించలేని అర్జీకు వాటిపై ఫిర్యాదుదారులకు కారణాలు చెప్పాలన్నారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కాగా, పీజీఆర్ఎస్‌లో అధికారులకు కలవడానికి వచ్చే అర్జీదారులను ఒక క్రమ పద్ధతిలో సమావేశ మందిరంలోకి అనుమతించాలి. జీఎస్ డబ్ల్యూ అధికారులు, సిబ్బంది అత్యుత్సాహంతో కలెక్టర్ కోసం ఒకటి.. ఇతరుల మరొకటి అంటూ రెండు లైన్లలో పంపడంతో కాసేపు గందరగోళం ఏర్పడింది. ఈ విషయం తెలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ ఆగ్రహించడంతో ఒక లైనులోనే అనుమతించారు.

తోతాపురికి గిట్టుబాటు ధర కల్పించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామానాయుడు, రైతు సంఘ నాయకులు

మామిడిలో ఎక్కువగా తోతాపురి రకం అధిక దిగుబడి వస్తుందని, గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్న రైతులకు న్యాయం చేయాలని మామిడి ధరల స్థిరీకరణ కమిటీ నాయకులు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. తోతాపురి రకానికి సరైన ధరలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ రకం మామిడిని పండించడానికి టన్నుకు రూ.15వేలు నుంచి రూ.20వేలు వరకు ఖర్చవుతోందని చెప్పారు. కాబట్టి టన్నుకు రూ.30వేలు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. మామిడి బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. టేబుల్ వెరైటీలను రైతు బజారులో ప్రభుత్వం ద్వారా విక్రయించి కనీస ధర ఉండేలా చూడాలన్నారు. మామిడి పల్ప్‌ను దేవాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామానాయుడు, గోపాల్‌రెడ్డి, హేమలత, వెంకయ్య, పద్మనాభం, అయ్యప్పనాయుడు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేత మా భూమి ఆక్రమించారు

మా పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమిని గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేత సురేష్‌రెడ్డి ఆక్రమించాడు. అందుకు రెవెన్యూ వాళ్లు సహకరించారు. ప్రభుత్వం మారింది. మా భూమిని మాకు ఇప్పించి రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి.

- మహేష్, అలిమిలి గ్రామం

శ్మశాన వాటికను ఏర్పాటు చేయండి



తిరుపతి అర్బన్ తిమ్మినాయుడు పాలెం హరిజనవాడలో 4 వేలు కుటుంబాలకు శ్మశాన వాటిక లేక ఇబ్బందిగా ఉందని ఏపీ అంబేడ్కర్ యువజనసంఘం నేత వెంకటరత్నం అన్నారు. 2018లో గ్రామానికి ఉత్తరం వైపున నిరుపయోగంగా ఉన్న అటవీ శాఖ భూమిని కేటాయించాలని అప్పటి జిల్లా అధికారులు ఆదేశించారన్నారు. ఇప్పటికీ శ్మశాన వాటిక కోసం స్థలం ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు.

ఇళ్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



తిరుపతి అర్బన్ మండలం వేణుగోపాల్ కాలనీలో వారం కిందట ఇళ్లను కూల్చివేసిన వారిపై కఠిన కేసులు నమోదుచేసి బాధితులకు న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, ఆర్‌పీఐ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు అంజయ్య డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద బాధితులతో కలిసి సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ ఘటనలో ప్రమేయమున్న రాజన్‌బాబు, నిర్మల, రమణారెడ్డి, చంద్రగిరి మస్తాన్, మునిరెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కోర్టు వివాదం ఉన్న స్థలాలను మోసం చేసి అమ్మిన రుద్రగోపి, శ్రీనివాసరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి వేణుగోపాల్, కార్యదర్శి వర్గ సభ్యులు మాధవ, బుజ్జి, బాధితులు వెంకటేష్, శ్రీరాములునాయక్, రిషిరెడ్డి, శివమణి, వెంకటేష్, పద్మావతి, కాంచన తదితరులు పాల్గొన్నారు.

మాపై అక్రమకేసులు

బాలయ్యపల్లి మండలం సరిహద్దు, వెంకటగిరి మండలం సరిహద్దు వద్ద మర్ధనంపల్లెలో పూర్వీకుల నుంచి మా అధీనంలో భూములను సాగుచేసుకుంటున్నారు. శ్రీకాళహస్తికి చెందిన కొంతమంది ఆ భూమికి కంచె వేస్తుంటే అడ్డుకున్నాం. మాపై అకారణంగా ఎస్ఐ సహకారంతో అట్రాసిటీ కేసు పెట్టి వేధిస్తున్నారు. సంబంధం లేని వ్యక్తుల ద్వారా తప్పుడు కేసులు బనాయించిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి.

- వెంకటేశ్వర్లు. అక్కసముద్రం, బాలయపల్లి

ఉపాధి కల్పించండి



సారూ.. మాకు ఏడేళ్ల కిందట వివాహమైంది. నేను, నాభర్త దివ్యాంగులం. మాకు ప్రభుత్వం తరపున దివ్యాంగుల కోటలో జీవనోపాధి కల్పించి ఆదుకోవాలి. పూట గడవడానికికూడా కష్టంగా ఉంది.

- మయూరి, ప్రదీప్, పేరూరు, తిరపతి రూరల్ మండలం

ప్రభుత్వ భూములు విక్రయిస్తున్న అధికారిపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి రూరల్ మండలంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీపీ చంద్రమోహన్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ మాదవరెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన డీటీ రియల్ ఎస్టేట్ వ్యాపారులతో చేతులు కలిపి భూఆక్రమణలకు సహకరిస్తున్నారని ఆరోపించారు. ఆయనపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.



ఆదుకుంటామని చెతేలెత్తేశారు

ఇటీవల ఏర్పేడు మండలం వికృతమాల సమీపంలోని ఓ కంపెనీలో భవన నిర్మాణం పనిచేస్తుండగా కటింగ్ మిషన్‌తో కాలు తెగిపోయింది. ఆస్పత్రిలో చికిత్స పొంది కూలీపనులకు వెళ్లలేక ఇంటికే పరిమితమయ్యా. అప్పుడు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కంపెనీ నిర్వాహకులు ఇప్పుడు పట్టించుకోవడంలేదు. నాకు న్యాయం చేయండి.

- విజయకుమార్, మేస్త్రీ, రేణిగుంట

పోలీసుల అదుపులో ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్ల చోరీల ముఠా

● ఎనిమిది మంది నిందితుల అరెస్టు



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

ఏర్పేడు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలో గత ఏడాది నుంచి రైతుల పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మలర్లు, మోటర్లు, స్టార్టర్లు, కేబుల్‌వైర్లు చోరీ చేసే ముఠాను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్లలో రాగి వైరు, బోరులో కేబుళ్ల చోరీపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో వరుస కథనాలు రావడంతో రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి, గాజులమండ్యం ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టారు. ఏర్పేడు, గాజులమండ్యం పోలీసులు ఏర్పేడు మండలంలోని వికృతమాల సమీపంలో ఉన్న టీసీఎల్ పరిశ్రమ వద్ద సోమవారం తెల్లవారజామున ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. శ్రీకాళహస్తి మండలం ఎర్రగుడిపాడుకు చెందిన వెంకట్రామయ్య, కత్తి మణి, జండా వెంకటేష్‌ను స్టేషన్‌కు తరలించారు. వారు చోరీ చేసిన రాగివైరు, బోరు కేబుళ్లను కొనుగోలు చేసిన తిరుపతికి చెందిన ఎస్‌కే ఖాదర్‌బాషా, సయ్యద్, హుస్సేన్, షేక్ బషీద్‌తో పాటు శ్రీకాళహస్తికి చెందిన షేక ఉస్మాన్, వెంకటగిరికి చెందిన గోపాలకృష్ణను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో ఏర్పేడు పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎనిమిది మంది నిందితుల నుంచి 795 కిలోల రాగివైర్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పూందమల్లి-పరందూర్ మధ్య మెట్రో సేవలు

● రాష్ట్ర ప్రభుత్వం అనుమతి

పెరంబూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక పూందమల్లి-పరందూర్ మెట్రోరైలు ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. పూందమల్లి నుంచి తిరుమలిసై, శ్రీ పెరుంబుదూర్ మీదుగా పూందమల్లి వరకు 'మాస్ రాపిడ్ ట్రాసిస్ట్ సిస్టమ్స్ (ఎంఆర్‌టీఎస్) ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర నివేదిక గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ మార్గంలో 43.63 కి.మీ మేర 19 ఫ్లై ఓవర్ రైల్వేస్టేషన్లతో ప్రాజెక్ట్ రూపొందించారు. పరందూర్‌లో ఏర్పాటుకానున్న విమానాశ్రయం, తిరుమలిసైలో మల్టీ బస్ స్టేషన్ తదితరాలతో భవిష్యత్తు ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతున్న దృష్ట్యా రవాణా సేవలు మెరుగుపరిచేలా ఈ ప్రాజెక్ట్ తయారుచేశారు. తొలివిడతగా పూందమల్లి-సుంకువారిసత్రం వరకు 27.9 కిమీ మేర మెట్రో ఫ్లై ఓవర్ రైలు మార్గం రూ.8,779 కోట్లతో ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని అధికారులు తెలిపారు.

విద్యుదాఘాతానికి ఇద్దరు డ్రైవర్ల మృతి

విడవలూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా విడువలూరు మండలం ముదివర్తి గ్రామంలోని రొయ్యల గుంతల వద్ద ఆదివారం రాత్రి విద్యుదాఘాతానికి గురై తమిళనాడుకు చెందిన ఇద్దరు కంటైనర్ డ్రైవర్లు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... ముదివర్తి పంచాయతీ పరిధిలో రొయ్యలను సాగు చేస్తున్న రాధయ్య పుదిచ్చేరిలోని స్టార్ హేచరీ నుంచి రొయ్య పిల్లలను కొనుగోలు చేశారు. దీంతో ఆ హేచరీ నిర్వాహకులు రెండు కంటైనర్లలో రొయ్య పిల్లలను ముదివర్తి గ్రామానికి పంపారు. ఆదివారం రాత్రి గుంతల వద్దకు వచ్చిన కంటైనర్లు రొయ్యల పిల్లలను అన్‌లోడ్ చేయడానికి డ్రైవర్ లోక్‌నాథ్ (45) లారీని గుంత కట్టమీదకి ఎక్కించాడు. దీంతో గుంతలపై వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు లారీకి తగలటంతో విద్యుత్ లారీ మొత్తం ప్రసరించింది. దీంతో డ్రైవర్ లోక్‌నాథ్ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈయన్ను కపాడే ప్రయత్నంలో మరో కంటైనర్ డ్రైవర్ మణి (25) కూడా విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు తమిళనాడులోని విల్లుపురానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ కుమార్ యాదవ్ తెలిపారు.

నిరుపయోగంగా థాడ్కో అభివృద్ధి విభాగం

● ఎస్సీ,ఎస్టీల ఆరోపణ

ప్యారీస్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఆదిద్రావిడ, గిరిజనుల సంక్షేమం కోసం రూపొందించిన తమిళనాడు ఆదిద్రావిడ హౌసింగ్ డెవలెప్మెంట్ కార్పొరేషన్ (థాడ్కో), కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల సహకారంతో ఈ వర్గాల ప్రజల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచేందుకు పలు పథకాలను అమలుపరుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ సంస్థ నిర్వహణలోని 38 కార్యాలయాల ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రుణాలు పంపిణీ, స్కిల్ డెవెలెప్మెంట్ శిక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే ఈ సంస్థలో గత మూడేళ్ళుగా కొనసాగుతున్న అవినీతి కారణంగా పథకాలు అమలుపరచడంలో జాప్యం కొనసాగుతోంది. థాడ్కో అభివృద్ధి విభాగం అధికారుల నిర్లక్ష్యం వలనే ఈ విభాగంలో అభివృద్ధికి కుంటు పడిందని ఆరోపణలున్నాయి. దీనిపై ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు మాట్లాడుతూ, సొంతిల్లు నిర్మించుకునేందుకు దరఖాస్తు సమర్పించే ఎస్సీఎస్టీ వర్గాలకు రుణసాయం చేసేందుకు రూపొందించిన థాడ్కో ప్రస్తుతం విద్యా, ఆర్థికాభివృద్ధి, ఉద్యోగావకాశలపై శిక్షణపై ప్రత్యేక దృష్టిసారించిందని వాపోయారు. థాడ్కోలో సమస్యలకు సంబంధించి సంబంధిత అధికారుల వద్ద విచారణ జరపాలని, ఎస్సీఎస్టీల సంక్షేమాన్ని కాంక్షించే ప్రభుత్వం థాడ్కో సంస్థను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వైభవంగా ధ్వజారోహణం



పెద్దశేష వాహనంలో ఉత్సవర్లు

తిరుపతి అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉత్సవర్లు, ధ్వజపటం, చక్రత్తాళ్వార్, పరివార దేవతలు నాలుగు మాడవీధుల్లో ఊరేగారు. ఆలయానికి వేంచేపుచేసి విష్వక్సేన ఆరాధన, వాస్తు హోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ఠ, రక్షా బంధనం చేపట్టారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవిందనామ స్మరణలు నడమ ఉదయం 7.02-7.20గంటల మధ్య మిథున లగ్నంలో గరుడ చిత్రంతో కూడిన ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. అనంతరం స్వామివార్లకు ఆస్థానం, స్నపన తిరుమంజనం కావించారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి పెద్దశేష వాహనంలో స్వామి వారు ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. జియ్యంగార్లు, అధికారులు పాల్గొన్నారు.





ఒకే విద్యార్థిని కోసం సర్కారు బడి

ప్యారీస్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా తిరువాడనై యూనియన్ పరిధిలోని తలిర్‌మరుంగూర్ గ్రామంలో ఒకే విద్యార్థిని కోసం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నడుస్తోంది. తిరువాడనై యూనియన్‌లో 112 ప్రభుత్వ, ఎయిడెడ్ ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలున్నాయి. వేసవి సెలవుల అనంతరం సోమవారం ఉదయం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో తొండి సమీపంలోని తలిర్‌మరుంగూర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల కూడా ప్రారంభమైంది. ఈ పాఠశాలలో గత ఐదేళ్ళుగా విద్యార్థులెవరూ చేరనందున గత ఏడాది 5వ తరగతిలో ఒక విద్యార్థి, 2వ తరగతిలో ఒక విద్యార్థి ఇద్దరు మాత్రమే చదువుకున్నారు. ఈ విద్యాసంవత్సరం 5వ తరగతి పూర్తయిన విద్యార్థి అక్కడి నుండి 6వ తరగతిలో చేరారు. ఇందువల్ల 2వ తరగతి నుండి 3వ తరగతికి వెళ్ళిన ఆ ఒక్క విద్యార్థిని మాత్రమే ప్రస్తుతం చదువుతోంది. ఈ సర్కారు బడిలో ఒక ప్రధానోపాధ్యాయుడు, ఒక టీచర్ మాత్రమే పనిచేసిన నేపథ్యంలో గత నెల ప్రధానోపాధ్యాయుడు పదవీవిరమణ పొందాడు. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం పునఃప్రారంభమైన పాఠశాలల్లో అడ్మిషన్లు జరుగుతుండగా, తలిర్‌మరుంగూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మాత్రం ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. తమ గ్రామంలోవున్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు లేకుంటే పాఠశాలను మూసివేస్తారనే కారణంగా ప్రైవేటు పాఠశాలలో 1వ తరగతి చదువుకుంటున్న తన కుమార్తెను ఈ పాఠశాలలో చదివిస్తున్నట్లు ఆ విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులెవరూ లేనందువల్ల తన కుమార్తెకూడా భయపడుతోందని, ఇప్పటికైనా విద్యార్థులను చేర్పించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



నేడు సీనియర్ పురుషుల క్రికెట్ సెలక్షన్స్

తిరుపతి(క్రీడలు), జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సీనియర్ మెన్స్ క్రికెట్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు సీడీసీఏ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి రవి ఓ ప్రకటనలో తెలిపారు. వాల్మీకిపురం, తిరుపతి, చిత్తూరు, మదనపల్లె క్రికెట్ మైదానాల్లో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. తెల్లని దుస్తులు, సొంత క్రీడా సామగ్రి, ఆధార్ తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9000214966, 8886185559లను సంప్రదించాలని కోరారు.

ఫెంగల్ తుఫానులో దెబ్బతిన్న చెరువులకు రూ.78.50 లక్షలు

● తిరుపతి, చిత్తూరు జిల్లాలకు మంజూరు

తిరుపతి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గతేడాది ఫెంగల్ తుఫానులో దెబ్బతిన్న తిరుపతి, చిత్తూరు జిల్లాల చెరువులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 78.50 లక్షలు మంజూరు చేసింది. గతేడాది నవంబరు 30వ తేదీ నుంచీ డిసెంబరు 2వ తేదీ నడుమ ఫెంగల్ తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఈ రెండు జిల్లాల్లో పలు మైనర్ ఇరిగేషన్ చెరువులు దెబ్బతిన్నాయి. వాటి తాత్కాలిక పునరుద్ధరణకు రూ. 9.54 కోట్ల నిధులు అవసరమని మైనర్ ఇరిగేషన్ విభాగం చీఫ్ ఇంజనీర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రాష్ట్ర విపత్తుల సహాయక నిధుల నుంచీ రూ. 78.50 లక్షలు మంజూరు చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు జిల్లాల్లో దెబ్బతిన్న చెరువులను తాత్కాలిక ప్రాతిపదికన పునరుద్ధరించడానికి రూ. 9.54 కోట్లు అవసరమవుతుందని ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించి పంపితే ఆరు నెలలు ఆలస్యంగా అది కూడా అరకొర నిధులు మంజూరు చేసింది. జనవరి నుంచీ మే దాకా పెద్దగా వర్షాలు కురిసే ఐదు నెలల పాటు పట్టించుకోకుండా తీరా నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురిసే సమయంలో చెరువుల మరమ్మతులకు నిధులివ్వడం విమర్శలకు దారి తీస్తోంది. వర్షాలు కురిసే సమయంలో చెరువులకు మరమ్మతులు చేయడం ఇబ్బందికరమన్న అంశాన్ని ప్రభుత్వం విస్మరించడం గమనార్హం.

షార్టు సర్క్యూట్‌తో కారు దగ్ధం

● ఆరుగురు ప్రయాణికులు సురక్షితం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): బ్యాటరీల్లో విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగాయి. దీంతో కారు పూర్తిగా కాలిపోయిన సోమవారం తిరుపతిలో చోటు చేసుకుంది. తిరుపతి అగ్నిమాపక శాఖాధికారి కిరణ్‌కుమార్ రెడ్డి కథనం మేరకు.. చెన్నైకు చెందిన ఎస్.ధర్మచంద్ కుటుంబ సమేతంగా.. మొత్తం ఆరుగురు కారులో (టీఎన్20బీడీ 6211) తిరుమలకు బయలుదేరారు. తిరుచానూరు రోడ్డులోని పిల్లర్ నెంబరు 28 వద్దకు కారు రాగానే బ్యాటరీలో విద్యుత్ షార్టు సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. కారులోని ఆరుగురు హుటాహుటిన కిందకు దిగేయడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. తిరుపతి అగ్నిమాపక అధికారి కిరణ్‌కుమార్ రెడ్డి, సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో మంటలు అదుపు చేశారు. అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో దాదాపు రూ రెండు లక్షల ఆస్తి నష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారు. తిరుపతి ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

